క్లుప్తంగా

వై.ఎస్.జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే గణేష్



మాజీ సీఎంతో మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం : తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసుల విషయాన్ని జగన్ దృష్టికి తీసుకువెళ్లినట్టు గణేష్ తెలిపారు. వచ్చేది మన ప్రభుత్వమేనని జగన్ భరోసా ఇచ్చారని, ప్రతి కార్యకర్తకు ప్రభుత్వం రాగానే న్యాయం చేస్తానని హామీ ఇచ్చారన్నారు. పార్టీ పటిష్టతకు కృషి చేయాలని రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాలని జగన్ సూచించారని గణేష్ తెలిపారు.

వేసవి దుక్కులు ప్రారంభం



పి.పి.అగ్రహారం వద్ద దుక్కులు చేస్తున్న ట్రాక్టర్

మాకవరపాలెం : వర్షాలతో రైతులు వేసవి దుక్కులను ప్రారంభించారు. ఏటా ఏప్రిల్, మే నెలలో రైతులు వేసవి దుక్కులు చేస్తుంటారు. అయితే ఇటీవల అడపాదడపా కురుస్తున్న వర్షాలు వేసవి దుక్కులకు ఎంతో మేలు చేశాయి. ఈ నేపథ్యంలో మండలంలోని కొండల అగ్రహారం, పైడిపాల, లచ్చన్నపాలెం, తామరం, పెద్దిపాలెం, పి.పి.అగ్రహారం, తదితర గ్రామాల్లో రైతులు దుక్కులు చేస్తున్నారు. ఇప్పటికే సేంద్రియ ఎరువుగా వినియోగించే పశువుల గెత్తాన్ని పొలాల్లో కుప్పలుగా వేసుకున్న రైతులు భూముల్లో కలియ దున్నుతున్నారు. వేసవి దుక్కులతో భూమి గుల్లబారడంతోపాటు పంటలకు హాని కలించే పురుగులు నశిస్తాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

కె.కోటపాడు : ప్రతిభా పరీక్షల నిర్వహణతోనే విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ బయట పడుతుందని చౌడువాడ శాఖా గ్రంథాలయాధికారి ఎం.పద్మావతి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో బాగంగా గురువారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో నీతి కథల పుస్తకాలు చదివించారు. సత్ప్రవర్తనతో కూడిన విద్యను పొందాలని విద్యార్థులకు సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు రోజున చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభను చూపిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు వైద్యాధికారి జ్యోతి

గొలుగొండ: రోగులకు ప్రభుత్వ ఆసుపత్రిలో మంచి సేవలు అందేవిదంగా వైద్య సిబ్బంది పనిచేయాలని జిల్లా అదనపు వైద్యాధికారి జ్యోతి తెలిపారు. ఆమె గురువారం గొలుగొండ పీహెచ్‌సీని సందర్శించారు. రోగులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ప్రతిరోజు ఈ పీహెచ్‌సీకి వచ్చిన రోగుల సంఖ్య, వారికి అందించే వైద్య సేవలు గురించి వైద్యాధికారి శ్యామ్ నుండి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీల సంఖ్య పెరగాలని, దీని కోసం ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఆస్పత్రిలో ఉన్న మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు.

దేశవ్యాప్త సమ్మెలో రవాణా కార్మికులు పాల్గొనాలి'



కె.కోటపాడులో ఆటో డ్రైవర్‌లతో మాట్లాడుతున్న నాయినిబాబు

కె.కోటపాడు : కేంద్ర ప్రభుత్వం మోటర్ ట్రాన్స్‌పోర్ట్ రవాణా కార్మికులకు నష్టం కలిగించేలా చట్టాలను రూపొందించేందుకు చేస్తున్న నిర్ణయాలను విరమించుకునేలా నిర్ణయాలను తీసుకునేంత వరకూ పోరాటాన్ని చేయనున్నట్టు సీపీఎం నాయకుడు గండి నాయినిబాబు అన్నారు. ఈ నెల 20న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్త సమ్మెను చేపడుతున్నట్లు ఆయన గురువారం కె.కోటపాడులో ఆటో డ్రైవర్‌లకు తెలిపారు. ఈ సమ్మెలో ఆటో డ్రైవర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు, ఈర్లె నాయుడుబాబు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో వారపు సంత



పంతరోజున రోడ్లపైనే వేసిన దుకాణాలు



శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉన్న మార్కెట్ షెడ్లు

- రోడ్లపైనే దుకాణాలు
- శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉన్న మార్కెట్ షెడ్లు
- బిక్కుబిక్కుమంటున్న వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు

మాకవరపాలెం : మండల కేంద్రంలో నిర్వహించే వారపు సంత సమస్యలతో సతమతమవుతోంది. కనీస సౌకర్యాలు లేకపోవడంతో వ్యాపారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ స్థలం ఉన్నా ఆ స్థలాన్ని వినియోగంలోకి తీసుకు రాకపోవడంతో రోడ్లపైనే దుకాణాలు వేసుకోవల్సిన పరిస్థితి వచ్చింది. ప్రతి మంగళవారం మండల కేంద్రంలో సంత నిర్వహిస్తారు. ఈ సంతకు వివిద మండలాల నుంచి కూరగాయలు, ఇతర వ్యాపారులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. కానీ తగిన సౌకర్యాలు లేకపోవడంతో ప్రతి వారం సంత రోజున వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడక తప్పడం లేదు.

కూలేందుకు సిద్ధంగా మార్కెట్ షెడ్లు

మార్కెట్ స్థలంలో సుమారు 60 ఏళ్ల క్రితం దుకాణాలు వేసేందుకు షెడ్లు నిర్మించారు. ప్రస్తుతం ఈ షెడ్లు శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఎప్పుడు కూలిపోతాయోనని వ్యాపారులు సంత రోజున బిక్కుబిక్కుమంటూ దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఇక కొనుగోలుదారులు కూడా ఈ షెడ్లలోకి వెళ్లేందుకు ఆందోళన చెందుతున్నారు. అయినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కాలీగా ఉన్న మార్కెట్ స్థలాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి, రోడ్లపై దుకాణాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే కూలిపోయే స్థితిలో ఉన్న షెడ్లను తొలగించి వాటి స్థానంలో కొత్త షెడ్లు నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలంటున్నారు.

ఖాళీగా మార్కెట్ స్థలం



బస్టాండు వెనుక ఖాళీగా ఉంటున్న మార్కెట్ స్థలం

ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక మార్కెట్ స్థలం ఉన్నా ఈ స్థలమంతా చెత్తాచెదారంతో నిండిపోయి అధ్వానంగా ఉంది. స్థానికులు ఈ స్థలాన్ని బహిర్భూమిగా వినియోగిస్తున్నారు. అయినా ఈ స్థలాన్ని వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత మార్కెట్ స్థలం చాలకపోవడంతో రోడ్లపైనే దుకాణాలు సాగిస్తున్నారు. దీంతో సంతరోజున ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి.

విద్యతోనే భవిష్యత్తు

డీఎస్పీ శ్రీనివాసరావు



విద్యార్థులకు ఎంసెట్ హాల్ టిక్కెట్లు అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నర్సీపట్నం : విద్యతోనే భవిష్యత్‌లో రాణించగలరని నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. ఎస్ఎఎన్ ఎడ్యుకేషనల్ సొసైటీ చారిటీ ఆధ్వర్యంలో రెండు నెలలుగా ఉచిత ఎంసెట్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు గురువారం హాల్ టికెట్లను డీఎస్పీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిటీ వారు ఉచితంగా ఎంసెట్ కోచింగ్ ఇవ్వడం అభినందనీయమన్నారు. చారిటీ వారు కల్పించిన అవకాశంతో ఎంసెట్‌లో మంచి ర్యాంకులు సాధించి మీ భవిష్యత్‌కు బాట వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యతో మీరు అనుకున్న లక్ష్యాన్ని సాధించగలరని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్.కృష్ణ, చారిటీ ఫౌండర్ సూరెడ్డి అప్పలనాయుడు, కరస్పాండెంట్ ఎస్.ఉమా మహేశ్వరి, శివ, వంశీ పాల్గొన్నారు.

వేసవిలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



కొత్తూరులో ఆరోగ్య పరీక్షలను చేస్తున్న హెల్త్ అసిస్టెంట్ త్రినాథ్

కె.కోటపాడు : వేసవికాలంలో వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు వైద్య సిబ్బంది వివరించే ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ అన్నారు. ఎ.కోడూరు శివారు కొత్తూరు గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య పరీక్షలను జరిపారు. బీపీ సుగర్ పరీక్షలతో పాటు 123 మందికి సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలను చేసి జాగ్రత్తలను వివరించారు. ప్రసవాలను గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే చేపట్టుకోవాలని త్రినాథ్ తెలిపారు. ఏఎన్ఎంలు. జి.లక్ష్మి, సంతోషికుమారి, డిజిటల్ అసిస్టెంట్ కుమారి, ఆశా కార్యకర్తలు దేముడమ్మ, సన్యాసమ్మ, భవాని, లక్ష్మి, మంగ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర ఉత్పత్తులు



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బందతో సర్పంచ్ కృష్ణంనాయుడు

రోలుగుంట : ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన అహారం అందుతుందని ఆ శాఖ నర్సీపట్నం డివిజన్ ఇంచార్జి ఎం.టి.నాగేశ్వరరావు అన్నారు. మండల ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోగురువారం ఆ శాఖ మండల ఇంచార్జి నిర్మల రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నవధాన్యాల సాగు, ఆకుకూరల సాగు, అధిక దిగుబడుల సాధన వంటి అంశాలను వివరించారు. రైతుల సందేహాలను మండల ఇంచార్జి నిర్మల నివృత్తి చేశారు. నవధాన్యాలు వేసిన రైతులు రైతు సేవా కేంద్రాలకు వివరాలు అందజేసి ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం సిబ్బందితో కలసి సర్పంచ్ కృష్ణంనాయుడు, ఎంపీటీసీ ముసులినాయుడు నవధాన్యాల విత్తనాలు పంపిణీ చేశారు. నీటి పారుదల శాఖ నుంచి దేవాడ రమణ, అధికారులు కలసి ప్రకృతి సాగులో ఉత్తమ రైతులను సన్మానించారు.

నీతి కథలతో విజ్ఞానం



విద్యార్థులకు నీతి కథల గురించి బోధిస్తున్న టీచర్ హైమావతి

నర్సీపట్నం : నీతి కథలతో విజ్ఞానం పెరుగుతుందని ఉపాధ్యాయని హైమావతి విద్యార్థులకు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న సమ్మర్ ఒరియంటేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా గురువారం విద్యార్థులకు నీతి కథలు బోధించారు. కథ చెప్పి అందులోని నీతిని ఉపాధ్యాయని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో కథకు భావాలను చెప్పించారు. అనంతరం ఉపాధ్యాయులు పి.కనకరాజు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో ఇప్పటి వరకు నిర్వహించిన కార్యక్రమాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రపంచ కుటుంబ దినోత్సవం కోసం చెప్పుతూ కుటుంబంలో ప్రతి ఒక్కరి స్థానం విలువైందని విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.దమయంతి విద్యార్థులకు దిశ నిర్దేశం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రోలుగుంట: నర్సీపట్నం డివిజన్ చెట్టుపల్లి ఫీడర్ రోలుగుంట సెక్షన్‌లో గల గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో కోత ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు నిమిత్తం ఈ ఫీడర్ పరిధిలోని కాముడిపాలెం, నిండుగొండ, గురందొరపాలెం, వడ్డిప గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని తెలిపారు.

దేవరాపల్లి : దేవరాపల్లి విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో మరమ్మతు పనుల్లో భాగంగా భాగంగా పినకోట 11 కేవీ ఫీడర్‌లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు స్థానిక ఎలక్ట్రికల్ ఏఈ కె.శంకరరావు తెలిపారు. శ్రీరాంపురం, పెదగంగవరం, వాలాబు, జీనబాడు, పినకోట, కివర్ల, జాలాడు వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. బోయిలకింతాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ పనుల నిమిత్తం ఉదయం 10 నుంచి 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ఈ కారణంగా జగన్నాథపురం, గవరవరం, కొత్తపెంట, ములకలాపల్లి, వేచలం, బి.కింతాడ, కలిగొట్లకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి తమకు సహకరించాలని ఏఈ శంకరరావు కోరారు.

మోదకొండమ్మ జాతర విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల : మాడుగుల మోదకొండమ్మ జాతర వచ్చే నెల 3 వ తేదీన జరగనుందని, పండగ విజయవంతం చేయడానికి మండల స్థాయి అధికారులు, వైద్యాధికారులు, పోలీసు, ఫైర్ అధికారులు సమన్వయంతో పని చేసి పండగ విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. గురువారం మాడుగులలో మండల స్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. అమ్మవారి జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ కమిటీకి సహకరించాలని సీఐ పైడిపునాయుడుకి ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని ఎంపీడీవో కొంకి అప్పారావును ఆదేశించారు. ఈ పండగకు సుమారు లక్షకు పైగా భక్తులు వస్తారని ఆలయ కమిటీ అంచనా ఉందని ఈ ప్రకారం బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అమ్మవారిని దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు, చేయడంతో పాటు వాహనాలు పార్కింగ్, తాగునీరు, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, మోదకొండమ్మ ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, సర్పంచ్ ఎడ్ల కళావతి, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనివాసరావు, కాలువ చైర్మన్ అద్దేపల్లి జగ్గారావు, ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు, కోఆప్షన్ మెంబరు షేక్ ఉన్నీసా, ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసీల్దార్ రమాదేవి, సీఐ పైడిపునాయుడు ఎస్ఐ నారాయణరావుతో పాటు వైద్యాధికారులు పాల్గొన్నారు.

దేవరాపల్లి మోడల్ కాలనీలో తాగునీటి ఇక్కట్లు

- సుమారు 2 నెలలుగా ఇంటింటా కుళాయిలకు నిలిచిన సరఫరా
- అవస్థలు పడుతున్న మోడల్ కాలనీవాసులు
- పంచాయతీ అధికారులకు ఫిర్యాదు



సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ వద్ద గోడును వెళ్లబోసుకుంటున్న మోడల్ కాలనీ మహిళలు

దేవరాపల్లి : దేవరాపల్లి మోడల్ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక మహిళలు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. సుమారు 2 నెలలుగా ఇంటింటా కుళాయిలకు మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం చేతి బోర్లను ఆశ్రయించాల్సి వస్తుందని వాపోయారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని మోడల్ కాలనీ మహిళలు ముక్త కంఠంతో కోరుతున్నారు. కాగా జల్‌జీవన్ మిషన్ పథకంలో నిర్మించిన నూతన మంచినీటి ట్యాంక్‌ల ద్వారా ఇంటింటా కుళాయిలకు తాగునీటి సరఫరా చేయాల్సి ఉంది. పంచాయతీలో తాగునీటి సరఫరా చేసే కాంట్రాక్ట్ సిబ్బంది కొత్త స్కీమ్‌లు తనకు సంబంధం లేదని చెప్పడంతో ఈ సమస్య నెలకొంది. మండు వేసవిలో మంచినీటి సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాల్సిన పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల స్థానిక మహిళలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఈదురు గాలుల బీభత్సం

- సత్యవరం గ్రామం అతలాకుతలం
- నేల కొరిగిన విద్యుత్ స్తంభాలు
- నివాస స్థలాల పైకప్పు రేకులు ఎగిరిపోయిన వైనం
- ఇళ్లలో తడిసిపోయిన ధాన్యం
- సత్యవరంలో నేలకొరిగిన చెట్లు
- స్తంభించిన జనజీవనం



సత్యవరం ప్రధాన రహదారిపై నేల కొరిగిన విద్యుత్ స్తంభం



సత్యవరంలో నేల కొరిగిన విద్యుత్ స్తంభం



చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో అతలాకుతలమైన సత్యవరం గ్రామం

మాడుగుల : మండలంలో గురువారం సాయంకాలం ఈదురుగాలులుతో కూడిన వర్షం బీభత్సం జరిగింది. మండలంలో సత్యవరం గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌లతో కూడిన విద్యుత్ స్తంభాలు 8 వరకు నేల కొరిగాయి. వొమ్మలి, జంపెన, రహదారుల్లో పలు చోట్ల చెట్లు విరిగిపోవడంతో సత్యవరం గ్రామం నుంచి ప్రజలకు ఎటూ వెళ్లలేని పరిస్థితి దాపురించింది. గ్రామంలో విద్యుత్ సదుపాయంలేక, రహదారులు చెట్లు కొమ్మలతో నిండిపోవడంతో జనజీవనం స్తంభించిపోయింది. గ్రామంలో ఉన్న చెట్లు మొత్తం నేల కొరగడంతో గ్రామంలో కూడా జనం తిరగలేక విద్యుత్ లేక అంధకారంలో ఉండిపోయారు. గురువారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ లేకపోవడంతో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. సత్యవరం గ్రామానికి చెందిన రైతు యాలం రామునాయుడుకు చెందిన రేకుల ఇంటిపై చెట్లు ఒరిగిపోవడంతో పై కప్పు రేకులు విరిగిపోయి ఇంటిలో ఉన్న సుమారు 30 బస్తాల ధాన్యం, ఇతర వస్తువులు తడిసి ముద్దయ్యాయి. సుమారు రూ. 2 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లింది. అదే గ్రామానికి చెందిన జాజిబొగ్గల రమణమ్మ రేకుల ఇంటిపై రేకులు గాలికి ఎగిరిపోవడంతో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగింది. అలాగే సత్యవరం ప్రధాన రహదారిపై మూడు చోట్ల విద్యుత్ స్తంభాలు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో విరిగిపోయిన విద్యుత్ స్తంభాలు పునరుద్ధరించి విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పాలిసెట్‌లో మాడుగుల విద్యార్థుల ప్రతిభ

మాడుగుల : పాలిసెట్‌లో మాడుగుల వీనస్ కోచింగ్ సెంటర్‌లో విద్యార్థులు మండల టాపర్‌లుగా నిలిచారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పాలిసెట్‌లో 25 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరిలో నియోజకవర్గ టాపర్‌గా కిలపర్తి కేశవ, 114, సలాది తులసి 111 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. పాలమర శెట్టి జయశ్రీ 109 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచింది. మరో 22 మందికి టాపర్‌గా నిలిచాలని కోచింగ్ సెంటర్ వ్యవస్థాపకుడు నాగచంద్ర తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు తల్లిదండ్రులు అభినందించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం అవసరం



రోగులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నాతవరం : సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రాజేష్‌నాయుడు అన్నారు. మండలంలో మాధవనగరం గ్రామంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 89 మంది రోగులను పరీక్షించగా మరికొంతమంది రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దీర్ఘకాలిక వ్యాధుల పట్ల మా సూచనలు పాటించాలని అన్నారు.

ఆంజనేయస్వామి ఆలయానికి విరాళం



స్వామివారి పాదాలుకు రూ.12 వేలు అందజేస్తున్న సర్వారావు

మాడుగుల : స్థానిక మూడు రోడ్లు కూడలిలో వెలసిన విజయాంజనేయ స్వామికి గ్రామానికి చెందిన పాలకుర్తి సర్వారావు రూ.12వేలు విరాళంగా గురువారం ఆలయ నిర్వాహకులు రాఖీ శ్రీనుకు అందజేశారు. ఈ సొమ్ముతో స్వామి వారికి వెండిపాదాలు తయారు చేయించాలని సర్వారావు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, కనిశెట్టి నగేష్, బసవా రామపరమేష్ పాల్గొన్నారు.

నేడు ఖండివరంలో మహా అన్నప్రసాద వితరణ

చీడికాడ : ఖండివరంలో గురువారం కోదండ రామచంద్ర స్వామి వారి ఆలయం వద్ద మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయం వార్షికోత్సవంలో భాగంగా బుధవారం, గురువారాల్లో ఆలయంలో వివిధ పూజలు, అభిషేకాలు జరుగుతాయని వారు తెలిపారు.

వైభవంగా కామేశ్వరమ్మతల్లి పండగ

మాకవరపాలెం : కామేశ్వరమ్మతల్లి పండగను వైభవంగా నిర్వహించారు. మండలంలోని రాచపల్లి జంక్షన్ సమీపంలో వెలసిన కామేశ్వరమ్మ తల్లి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రజలతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు ఉదయం నుంచే ఆలయం వద్దకు చేరుకుని దర్శనం కోసం బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయడంతోపాటు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయకమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రికి గ్రామంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ పండగలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మాకవరపాలెం: విద్యార్థుల హక్కులకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్న అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గౌతమి లలిత కళా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి విద్యార్థులకు వేసవి శిక్షణ ప్రారంభించారు. దీనిపై ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో మండల విద్యాశాఖ అధికారులు వేసవి శిక్షణను పాఠశాలలో జరగకుండా నిలిపివేశారు. దీంతో నిర్వాహకులు తమ దృష్టికి తీసుకువచ్చారని సంపత్‌కుమార్ తెలిపారు. రాజకీయ, మతపరమైన , ఇతర ప్రైవేటు కార్యక్రమాలకు పాఠశాలల ఆవరణలో నిర్వహించరాదని ఆదేశాలున్నాయే తప్ప, విద్యార్థులకు యోగా, నృత్యం, స్పోకెన్ ఇంగ్లిష్, చదరంగం వంటి వాటిలో శిక్షణ నిర్వహించ వద్దని ఆదేశాలు లేవన్నారు. జిల్లా వ్యాప్తంగా 50 కిపైగా ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిక్షణలు జరుగుతున్నాయని స్వయంగా జేసీ జాహ్నవి ప్రకటించారన్నారు. సోమవారంలోగా పాఠశాలలో యథావిధిగా వేసవి శిక్షణ జరిగేలా చర్యలు తీసుకోవాలని లేకుంటే విద్యాశాఖ అధికారులపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు.

అర్హులైన కౌలుదారులకు సాగుపత్రాలివ్వాలి

రావికమతం: అర్హులైన కౌలు రైతులందరికి సాగు హక్కు పత్రాలు జారీ చేసి వారికి ప్రభుత్వం నుంచే అందించే పథకాలు వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని,అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందే విధంగా వ్యవసాయ శాఖ సిబ్బంది పని చేయాలని రావికమతం మండల తహశీల్దార్ బి.వెంకటరంణ ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయశాఖ సిబ్బంది, వీఆర్వోలు, రైతుసేవా కేంద్రం నిర్వాహకులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఏవో రూప, వీఆర్వోలు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలి

రావికమతం : మండల సర్వ సభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ పైల రాజు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వెంకన్నబాబు తెలిపారు. మండల సర్వసభ్య సమావేశానికి సభ్యులు, అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.